— రిత్విక్

సమాజాన్ని ఆరోగ్యవంతంగా వుంచేందుకు తీసుకునే చర్య కూడా ఒక్కోసారి అమానుషంగా వుంటుంది.అటువంటి చర్యకూ,ఆత్మీయుల పట్ల వుండే అనుబంధానికీ మధ్య 'ఘర్షణ' ఏర్పడటం ఎంత విషాదం!

# ది మదర్ అండ్ చైల్డ్



అందమైన పద్యంలా వుందని ఆ ఉదయాన్ని పొగడాలని పించడం లేదు. కిలోమీటరు దూరంలో ఎసిటిక్ ఏసిడ్ ప్లాంటు నుండి వస్తున్న మలిన వాయువు అలలు అలలుగా వ్యాపించి, సిటీ అంతా గాలి సముద్రంలో మునిగిపోయిన ఫీలింగ్ కలుగుతోంది. పైన సూర్యుడు, ఆకాశం శవం నుదిటిమీద వెక్కిరింతలా మెరుస్తున్న బొట్టులా వున్నాడు. ప్రమాద వశాత్తూ నిప్పంటుకొని తగలబడుతున్న పెయింటింగ్‌లా వుందా ఉదయం.

ఉదయాన్నే నిద్ర లేవడమంటే, గొప్ప విరాకు డాక్టర్ మాధురికి, ముఖ్యంగా డిసెంబరు ఉదయాలు. వణుకుతూ ఇంట్లో అటూ ఇటూ తిరగడమంటే ఆవిడకెంతో విసుగు. కానీ ఆ రోజు తప్పడం లేదు. 'ఎయిడ్స్ రన్' ఉదయం ఏనిమిది గంటలకు, పెరేడ్‌గ్రౌండ్స్‌లో. తనే ఫ్లాగ్ ఆఫ్ చెప్పాలి. బద్ధకంగా, విసుగ్గా ఆరు గంటలకే నిద్రలేచింది. ముప్పయి అయిదేళ్ళ యవ్వనం రాత్రి నిద్ర తాలూకు మంత్రీ మహిమతో తాజాగా, నిండుగా మోహనంగా తయారైంది. ప్రొఫెషన్‌లోని ఎగో, మొనాటనీ, క్రూయల్టీ అంటని మాధురి ఆ క్షణాల్లోనే తటస్థపడుతుంది. ఆమె భర్త డాక్టర్ ఆనంద్‌కు అత్యంత ప్రియమైన క్షణాలు అవే. తన ముఖానికి తగిలించుకున్న గాంభీర్యపు ముసుగు విసిరేసి ఎరోటిక్‌గా అల్లరిగా తయారవుతాడు. వాళ్ళ ఉదయం లవ్-మేకింగ్‌తో మొదలవుతుంది.

ఏడున్నర గంటల ఉదయం. అద్దం ముందు కూర్చుని కేక్ ముఖానికి పట్టించుకొంటున్న

7-2-92 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక

మాధురికి పెదవులపై సన్నని నవ్వు వెలిసింది. 'యూ ఆర్ క్రేజీ' అని ఆనంద్‌ని ఎంత విసుక్కున్నా, వాళ్ళ దాంపత్య జీవితంలోకెల్లా మధురమైన క్షణాలు అవే అని మాధురికి తెలుసు. కేక్ వేసిన ముఖంపై ఆనంద్ ముద్దుల తడి విక్రుతంగా తయారయి, "యూ రోగ్!" అంటూ కోపంగా కేక్ బాక్స్ అతని ముఖంపై విసిరేది. అన్‌కాన్షస్‌గా ఆ రోజూ కేక్ బాక్స్ విసిరి వేయబోయి అక్కడ ఆనంద్ బదులు ఎలీసా వుండడం చూసి కాస్త సిగ్గుపడి, చిన్నబోయి "మార్నింగ్ డియర్! అప్పుడే నిద్ర లేచావా?" అంది. "నేను నిద్రలేచి చాలా సేపయింది మమ్మీ! డాడీకి టెంపరేచర్ చూసి, సిప్రాక్స్, మెటాసిన్ టాబ్లెట్సు ఇచ్చి వస్తున్నాను. బైది వే! యూ ఆర్ లుకింగ్ గ్రేస్ ఫుల్. గెటింగ్ రడీ ఫర్ ది రన్?" తల్లి అందాన్ని మెచ్చుకుంటూ కాంప్లిమెంటు చేసింది ఎలీసా. "ఓ! థ్యాంకూ! నీ సంగతేమిటి నువ్వు రావటం లేదా?" "వస్తున్నాను. కానీ ఇంత మేకప్ నాకవసరం లేదు" అంది ఎలీసా నవ్వుతూ. మేకప్ పూర్తిచేసుకొని, చివరి ఐటమ్‌గా సెంట్ తీసుకొంది. స్ప్రే చేసుకోను. అది కాస్ట్లీ ఫారిన్ సెంట్. ఎలీసా ముందుకు వచ్చి ఆ సెంటు బాటిల్ లాక్కుని

## భారతరత్న!

"నేను 'భారతరత్న' కోసం ఎదురు చూస్తున్నాను" అన్నాడు సుబ్బారావు

"మహామహా వాళ్ళకే రాలేదు. బోడి నీకేమిటి" అన్నాడు అప్పారావు.

"అది కాదు మా మొదటి అమ్మాయికి 'పద్మశ్రీ' అని పేరు పెట్టాను. ఆ తర్వాత ఇద్దరు పిల్లలకి 'పద్మ భూషణ్', 'పద్మ విభూషణ్', అని పేర్లు పెట్టాను. ఇప్పుడు నాలుగు రెడీ అవుతోంది. అందుకే భారతరత్న కోసం ఎదురు చూస్తున్నాను చెప్పాడు సుబ్బారావు.

– బంటి

"నో మమ్మీ! ఇది వాడడానికి నేను ఒప్పుకోను. ఇది ఓజోన్ - ఫ్రెండ్లీ స్ప్రే కాదు. దీనిలోని CFC ఓజోన్ పొరని డిస్ట్రాయ్ చేస్తుంది. ఓజోన్ పొర నాశనమైతే ప్రపంచమంతా బర్నింగ్ హెల్ అవుతుంది. ఇంట్లో వున్న ఏసీ మిషన్లూ, ఫ్రిజ్‌లూ బంద్ చేయడానికి డాడీ కూడా ఒప్పుకున్నాడు. నువ్వే కోపరేట్ చెయ్యడం లేదు" అంది నిరసనగా. "మీ డాడీ నీ బుర్ర బాగానే పాడు చేశాడు. నిన్ను రోజూ లాబ్‌కి తీసుకెళ్ళడం పొరపాటయింది. వయసుకు మించిన తెలివి నీ బుర్రలో ఎక్యుములేట్ అయింది. ఓకే! ఐయామ్ సేయింగ్ నో టు ఓజోన్ - డిస్ట్రాయర్స్. కమాన్! గెట్ రడీ!" అంది నవ్వుతూ. వైట్ జీన్స్, టీ షర్టులలో ఆ ఇద్దరూ అద్భుతమైన సౌందర్యానికి దీర్ఘమైన, హ్రస్వమైన నిర్వచనాల్లా వున్నారు. వాళ్ళ మారుతీ కారు గేటు దాటుతుండగా, బాల్కనీలోంచి డాక్టర్ ఆనందు నవ్వుతూ చెయ్యి వూపుతున్నాడు వీడ్కోలుగా.

సమకాలీన వైద్య ప్రపంచంలో డాక్టర్ మాధురి అంటే ఒక సెన్సేషన్. ఎయిడ్స్ ఒక వైపు ప్రపంచాన్ని దావానంలా కాల్చివేస్తుంటే, ఇండియాలో కూర్చుని మీనమేషాలు లెక్కవేసే వాళ్ళకు షాక్ ట్రీట్‌మెంటులాంటిది ఇచ్చింది మాధురి. ఇండియాలోని మొట్టమొదటి ఎయిడ్స్ పాజిటివ్ కేసును ఆవిడే కనిపెట్టింది. ఎయిడ్స్ వైరస్‌ను కనిపెట్టే ఎలీసా (ELISA) టెస్ట్‌ను లోకల్ కండీషన్సుకు అనువుగా మార్చి వందలాది సీరమ్ శాంపిల్స్‌ని పరీక్షించింది. మెహందీ ఏరియాకు వెళ్ళి, వాళ్ళను బతిమాలి వాళ్ళ శాంపిల్స్ తీసుకొంది. వెలకు అద్దెకిచ్చే చర్మ




గృహాల్లాంటి వాళ్ళ దేహాల్లో ఎయిడ్స్ నిప్పు రగిలిందనీ, అది దేశమంతా చుట్టుముట్టడానికి ఎంతోకాలం పట్టదనీ వార్నింగ్ ఇచ్చింది. మాధురి పరిశోధనలకు గుర్తింపుగా 88లో 'ధన్వంతరి' అవార్డు ప్రదానం చేసింది ప్రభుత్వం. మాధురికి పరిశోధనంటే ప్రాణం. తన ముద్దుల పాపకు ఎయిడ్స్ వైరస్‌ను కనిపెట్టే 'ఎలీసా' టెస్ట్ పేరు పెట్టుకొంది.

"విశృంఖలమైన ప్రపంచానికి భగవంతుడిచ్చిన శాపం ఎయిడ్స్. అవును నిజం. ఎయిడ్స్‌కి చికిత్సలేదు. ఇకరాదు. ఎయిడ్స్ రావడమంటే చావు చిట్టాలో మన పేరు నమోదు చేసుకున్నట్లే. బి వేర్ ఆఫ్ ఎయిడ్స్. మన ఆలోచనల్నీ, పద్ధతుల్నీ, సెక్స్ జీవితాన్నీ పవిత్రంగా వుంచుకోవాల్సిన సమయం వచ్చింది. స్వేచ్ఛా ప్రణయాలకు ఫుల్‌స్టాఫ్ పెడతాం. డాన్ జోన్‌లు, గోపికా పరివేష్టితుడైన శ్రీకృష్ణుడు మనకు ఆదర్శం కారాదు. ఒకే పత్ని - ఒకే బాణం అన్న శ్రీరాముడిలా మారాలి అందరూ. అదే ఎయిడ్స్‌కు ట్రీట్‌మెంటు. భగవంతుడు మానవ జాతిపై అవ్యాజమైన అనురాగంతో ఇచ్చిన దివ్య వరం సెక్స్. దాన్ని కిరాయికి కొనుక్కోవడం మానివేద్దాం. అన్నింటికంటే ముఖ్యంగా స్త్రీని ప్రేమించడం నేర్చుకొందాం. స్త్రీ అంటే సెక్స్ యంత్రము అనుకునేవాడు ఎయిడ్స్‌కి కాబోయే మొట్టమొదటి విక్టిమ్. ఫ్రెండ్స్! ఈ ఎయిడ్స్ రన్ మన అంతరంగాల్లోకి మనం చేసే అంతర్వీక్షణ పరుగు కావాలి. లాంగ్ లివ్ ది హ్యూమన్ రేస్! లాంగ్ లివ్ ది వరల్డ్ హెల్త్!" ఉద్రేక పూరితమైన డాక్టర్ మాధురి ఉపన్యాసం ముగిశాక చప్పట్లతో పెరేడ్ గ్రౌండు మారుమోగింది. ఎలీసా విస్మయంతో, గర్వంతో తల్లి వైపు చూస్తుండగా, మాధురి ఎయిడ్స్ రన్‌కి ఫ్లాగ్ ఆఫ్ చెప్పింది

***

"మమ్మీ! ఐగాట్ ఎలీసా పాజిటివ్!" ఎలీసా అరుపులకు ఉలిక్కిపడి చూసింది మాధురి. సెంట్రల్లీ ఎయిర్ కండీషన్డు లాబ్ అది. మైక్రోస్కోపులు, రీఏజంటులు, కల్చర్ మీడియాలు, అమాయకంగా గంతులువేసే కుందేలు పిల్లలు - తల్లీ కూతుళ్ళిద్దరూ నిత్యం విహరించే ఉద్యానవనమది. ఆ లాబ్‌ను పాలించే మహారాణి మాధురి అయితే, ఎలీసా దానికి యువరాణి. ఎలీసాకు లాబ్‌లోని ప్రతి పనిముట్టూ తెలుసు. నిజానికి ఆ లాబ్‌లోని పరికరాలే ఎలీసాకు ప్రియ నేస్తాలు. ఎలీసా ఎగ్జైటెడ్‌గా వుంది. అసాధారణమైన ఎయిడ్స్ టెస్ట్ ఎలీసా పాజిటివ్ వచ్చింది. అదో థ్రిల్లింగ్ అనుభూతి ఆ చిన్నారి పాపకు. మాధురి ముఖంలో క్షణంపాటు ఆశ్చర్యం, విస్మయం. "బ్లడ్ శాంపిల్ ఎక్కడి నుంచి తీశావు?" అంది క్యూరియాసిటీతో. "ఇదిగో ఈ బాటిల్‌లో వుందే, ఇదే" అంటూ చిన్న బాటిల్ చూపింది. మెదడులో శక్తిమంతమైన బాంబు విస్ఫోటనం చెందినట్లుగా ఉలిక్కిపడింది మాధురి. గాడ్! అది ఆనంద్ బ్లడ్ శాంపిల్. టైఫాయిడ్ సీరమ్ టెస్ట్ కోసం తెచ్చింది. మాధురి క్షణకాలం పాటు పిచ్చిదానిలా అయిపోయింది. ఆ శాంపిల్‌తో మరోసారి ఎలీసా టెస్ట్ చేసింది. రిజల్టు పాజిటివ్. "దేవుడా! ఎంత పని చేశావు" అంటూ కూలబడిపోయింది. క్షణంసేపు మెదడు పారలైజ్ అయిపోయింది. వాస్తవం, అందులోని విషాదం అర్థమయ్యేసరికి తట్టుకోలేని దుఃఖం ఆనకట్టలు తెంచుకున్న నదిలా ఎగిసివచ్చింది. గోడకు చేరగిలబడి పొగిలి పొగిలి ఏడ్చింది. చిన్నారి ఎలీసా భయంభయంగా తల్లిదగ్గరకు వెళ్ళి, మృదువుగా ఆమె జుట్టు నిమురుతూ "ఈజీ! డార్లింగ్ ఈజీ!" అంటూ ఓదార్చుతోంది. సరిగ్గా అలాగే ఓదార్చేది అమ్మ తను ఏడ్చేటప్పుడు. అంతకు మించి ఆ పరిస్థితి తాలూకు విషాదం అంతుపట్టలేదు ఎలీసాకు.

***

"హాయ్ ఎక్వైర్, అని అడగను. ఏ వేశ్య దగ్గర నుంచో నీకు వచ్చిందని నేను అనుకోవడం లేదు. నీ నిజాయితీపై నాకు నమ్మకముంది. ఏక్సిడెంటల్ అనుకుంటున్నాను. ఏ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ టైమ్‌లోనో, నీకు అంటుకొని వుంటుందనుకుంటున్నాను. కానీ, అయినా సరే, యు హేవ్ టు లీవ్ అజ్! ఆనంద్! ఐయామ్ సారీ! నీకు తెలుసు నేను నిన్నెంతగా ప్రేమిస్తున్నానో. కానీ తప్పదు. నువ్వు మమ్మల్ని వదలి వెళ్ళక తప్పదు. బ్యాంక్‌లో వున్న డబ్బంతా తీసుకో. ఎక్కడికయినా నీ యిష్టమొచ్చిన చోటికి వెళ్ళు. మమ్మల్ని మర్చిపో. మృత్యువును ఇంటిలో పెట్టుకొని నిబ్బరంగా వుండగలిగే ధైర్యం లేదు నాకు. పదేళ్ళ ఎలీసా కోసం వెళ్ళిపో. పరిశోధనా రంగంలో అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చుకుంటున్న నా కోసం వెళ్ళిపో. అందరూ మన కుటుంబాన్ని వెలివేయకుండా వుండడం కోసం వెళ్ళిపో. నీకు ఎయిడ్స్ వచ్చిందని ఎక్కడా చెప్పను. ఏ నర్సుతోనో లేచిపోయావని చెబుతాను. లేదా స్టేట్స్‌కి వెళ్ళావని చెబుతాను. కానీ నువ్వు మాత్రం వెళ్ళిపో. వీలయితే ఈ రోజే."

***

"మమ్మీ!"

"యస్ డార్లింగ్!"

"ఎయిడ్స్ ఎలా స్ప్రెడ్ అవుతుంది?"

"అది ..." వివరంగా చెప్పలేక అర్థోక్తిగా ఆగిపోయింది మాధురి.

"ఎయిడ్స్ పేషంటు బ్లడ్ శాంపిల్‌లో ముంచిన నీడిల్ వాడితే వస్తుంది కదా!"

"అఫ్‌కోర్సు డార్లింగ్!"

"డాడీ బ్లడ్ శాంపిల్‌లో ముంచిన నీడిల్ నా వెయిన్‌లో గుచ్చుకొన్నాను. ఐయామ్ ఏన్ ఎయిడ్స్ పేషంటు నే! ఎయిడ్స్ వస్తే ఇంట్లో వుండడానికి వీలు లేదుకదా!"

"ఎలీసా!"

"యస్ మమ్మీ! డాడీని ఎక్కడికి పంపావో చెప్పు. నేనూ డాడీతోనే వుంటాను. పాపం డాడీకి అన్నం ఎవరు పెడతారు? మందులు ఎవరు ఇస్తారు? నన్నూ పంపించెయ్యి మమ్మీ!"

"ఎలీసా! ఎలీసా" హృదయ విదారకంగా ఏడుస్తోంది డాక్టర్ మాధురి.

శ్రీ

## కుక్క కాటుకు చెప్పుదెబ్బ

హైదరాబాద్ నవాబు పరిపాలనలో ఉండగా వజీరు ఓ వీధీ వెంట నడిచి వెళుతున్నాడు.

వజీరును చూడగానే ఒక సర్దార్‌జీకి ఆయన్ని ఏడిపించాలని బుద్ధిపుట్టింది.

ఆయనకు ఎదురుగా వెళ్ళి "వజీర్ సాబ్! మిమ్మల్ని నవాబుగారు కుక్కల మీద అధికారిగా నియమించారట. నిజమేనా?" అన్నాడు వ్యంగ్యంగా.

వజీరుకు అతని దుర్బుద్ధి అర్థమయి "నిజమే సర్దార్‌జీ" అన్నాడు.

"మీకు ఈ పదవి లభించిన సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు స్వీకరించండి" అన్నాడు నవ్వుతూ సర్దార్‌జీ

"బహుత్ బహుత్ షుక్రియా సర్దార్‌జీ! మీ వంటివారి మీద అధికారం చెలాయించే అవకాశం కల్పించినందుకు నేను నవాబుగారికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. వస్తాను సర్దార్‌జీ!" అంటూ ముందుకు సాగాడు. జయప్రకాశ్

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్